క్లుప్తంగా

'అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదివాసీ పర్ధాన్ సమాజం పై ఈనెల 12వ తేదీన సోషల్ మీడియా వేదికగా తిర్యాణి మండలానికి చెందిన వెంకటేశ్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ కాంతి లాల్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆత్మగౌరవాన్ని కించపర్చేలా దుర్భాషలాడారని మండిపడ్డారు. నాయకులు వందన, బుధబాయి తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



పోలీసుల అదుపులో నిందితులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఎస్సై కందూరి రాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం లోనవెల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా ఆలూరి ప్రకాశ్ ఇంటి ఆవరణలో పేకాట ఆడుతున్న బేందరి శ్రీనివాస్, పిర్సింగుల లచ్చన్న, బొడ్డు రవి, ఆలూరి కిషోర్, డోంగ్రె రూప్‌లాల్, టేకుల శంకర్, బుద్ధ స్వప్నిల్, బోనగిరి నవీన్‌లను అరెస్టు చేసి సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పూల్‌జలే అనిల్, జునారి ప్రశాంత్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు ఇంటి యజమాని ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

15న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 15న దహెగాం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో వినియోగదారుల పరిష్కార వేదిక, నిజామాబాద్ ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ ఏఈ కమలాకర్ సోమవారం తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణ, మండల వినియోగదారులతో పాటు దహెగాం మండలంలోని వినియోగదారులు కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులు ఉంటే చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థినికి కలెక్టర్ సన్మానం



సఫురా ఫాతిమాకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సఫురా ఫాతిమాను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ అదనపు కలెక్టర్ చంద్రయ్య, సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి, ఆర్‌ఎల్‌సీ రాజేందర్‌తో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరికి చెందిన సఫురా ఫాతిమా మంచిర్యాలలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల స్కూల్/కాలేజీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అభ్యసించి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎండీ.తాహెరుద్దీన్, అబ్దుల్ నజీర్, విద్యా సమన్వయకర్త ఎండి.రిజ్వాన్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సంధ్య, విద్యార్థిని తండ్రి ఎండి.అసద్‌ఖాన్ పాల్గొన్నారు.

'పంటరుణం కింద కోత విధించొద్దు'

భీంపూర్: ఇందిరమ్మ ఇళ్ల చెల్లింపులను పంటరుణం కింద కోత విధించొద్దని మల్లెపూల సుజాత బ్యాంక్ అధికారులను కోరారు. మండలంలోని కరంజి(టీ) గ్రామానికి చెందిన సుజాత తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా విడుదలైన లక్ష రూపాయలను తీసుకుందామని వెళ్లగా బ్యాంకు అధికారులు రూ. 47,500 పంట రుణాన్ని మినహాయించి మిగతా డబ్బులను ఇచ్చారన్నారు. మిగతా ఇందిరమ్మ ఇంటి పని ఏవిధంగా చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పూర్తి చెల్లింపులను చేయాలని విన్నవించారు.

గతుకుల రోడ్లతో తిప్పలు

- ధ్వంసమైన కాగజ్‌నగర్ – జీడిచేను రోడ్డు
- పగుళ్లు తేలడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు



పగుళ్లు తేలిన సిమెంటు రోడ్డు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణం నుంచి జీడిచేను గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిచేను గ్రామం నుంచి నిత్యం వందలాది మంది ఎస్పీఎం కార్మికులతో పాటు ప్రతీరోజు ఉదయం పాలవ్యాపారులు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. కాగజ్‌నగర్ పట్టణం నుంచి జీడిచేను 3 కిలోమీటర్ల దూరం ఉండగా ఒక కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కాపువాడ నుంచి జీడిచేను గ్రామ సమీపంలో ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా పగుళ్లు తేలడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్పీఎం కార్మికులు, పాల వ్యాపారులు సైకిళ్లతో కాగజ్‌నగర్ పట్టణానికి వస్తుండడంతో సిమెంట్ రోడ్డు పగుళ్లు తేలి వారికి ఇబ్బందిగా మారుతుంది. రోడ్డు పగుళ్లతో వాహనచోదకులు కింద పడి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డు పగుళ్లు తేలిన ప్రాంతంలో వీధిలైట్లు కూడా లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి ఉండడంతో వాహనదారుల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రోడ్డుపైకి వచ్చిన తుమ్మ చెట్ల కొమ్మలు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



నేను ఎస్పీఎంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాను. ప్రతీరోజు ఈ మార్గం గుండానే కాగజ్‌నగర్‌కు రావాల్సి ఉంటుంది. సిమెంట్ రోడ్డుకు పగుళ్లు తేలడంతో సైకిల్‌పై వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇతర కార్మికులు కూడా ఈ ప్రాంతంలో కిందపడిన సంఘటనలు ఉన్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. – అరిగెల మొండి, కాంట్రాక్టు కార్మికుడు, జీడిచేను

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



పగుళ్లు తేలిన సిమెంటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. ప్రతినిత్యం కూలీ పని చేసేందుకు పట్టణానికి వెళ్తుంటాను. రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. – లక్కం రాఘవులు, దినసరికూలీ, జీడిచేను

ఇసుక రవాణాతో రోడ్లు ధ్వంసం

- ధ్వంసమైన పంగిడిమాదర –లింగాపూర్ రోడ్డు
- అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు

తిర్యాణి: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అధికలోడుతో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా, 134 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40శాతానికి పైగా ఉండగా, అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు సైతం అక్రమార్కుల అధిక లోడు అక్రమ ఇసుక రవాణాతో పూర్తిగా చెడిపోతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణాపై అధికారులు పట్టించుకోకుండా మాములుగా తీసుకుంటున్నట్లుగా ఆరోపణలు విన్పిస్తున్నాయి.

అత్యవసర సమయంలో ఇబ్బందులు..

జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో ఇసుక నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో అక్కడి వారు ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట గ్రామంలోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మండలంలోని పంగిడిమాదర మీదుగా లింగాపూర్‌కు ఇసుక తరలిస్తున్నారు. దీంతో పాటు మండలంలోని కొటగాం పంచాయతీ పరిధిలోని వాగు నుంచి సైతం అనుమతులు లేకుండానే రవాణా చేస్తున్నారు. అసలే రోడ్డు తారు లేచి ఉండటం.. దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో పంగిడిమాదర గ్రామం నుంచి దాంపూర్, కొటగాం, లింగాపూర్, సిర్పూర్(యూ) గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాల పాలైన సంఘటనలు సైతం అనేకం ఉన్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్ వాహనం కూడా నడిచే పరిస్థితి లేకపోవడంతో ఆదివాసీలకు రోడ్డు కష్టాలు తప్పడం లేదు.



అధ్వానంగా పంగిడిమాదర నుంచి లింగాపూర్ వెళ్లే రోడ్డు

నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట వాగు నుంచి ఇసుకను పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి తరలిస్తున్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలి. రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుంది. తిర్యాణి నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్ వెళ్దామంటే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడం లేదు. నూతన రోడ్డు నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలి. – గెడం సుభాశ్, తుడుందెబ్బ జిల్లా నాయకుడు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



దేవాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని లక్మాపూర్, దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు ప్రతీరోజు డైరీలు రాయాలని, ఎఫ్‌ఆర్‌ఎస్‌లో ఉదయం, సాయంత్రం హాజరు వేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, భోజనంలో సుచి, శుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బోర్డుపై రాయించారు. అక్షరాలు చదివించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం



చిన్నారులకు ఆర్థికసాయం అందజేస్తున్న సామాజిక సేవకులు

లింగాపూర్: మండలంలోని మోడిగూడ గ్రామానికి చెందిన కనక భీంరావ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో ఆరుగురు పిల్లలు అనాథలుగా మారారు. వీరి పరిస్థితి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పలువురు సామాజిక కార్యకర్తలు సోమవారం పిల్లలను పరామర్శించి రూ. 67,000లతో పాటు బట్టలు, ఇతర వస్తువులు అందజేశారు. సామాజిక వేత్తలు చాహకటి శ్యామ్‌రావ్, మడపచ్చి అర్జున్, సిడాం రామ్‌చందర్, మాడావి భూషన్, భుజంగ్‌రావు, కనక వెంకటేశ్, ఆత్రం చొక్కారావు, ధర్మారావు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెంచికల్‌పేట్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై సునీత అన్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు సోమవారం పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, పెంచికల్‌పేట్ మండల, కాగజ్‌నగర్ సబ్‌డివిజన్ విద్యాలయంలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు భద్రతా చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైం వంటి అంశాలపై వివరించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే కాగజ్‌నగర్ షీటీమ్ 8712670565 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జి.యాదగిరి, ఉపాధ్యాయులు గంగాభవాని, లక్ష్మి, భాగ్యశ్రీ, నాగరాణి, ఉజ్వలశీల, షీటీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

గుండా మల్లేశ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

రెబ్బెన: దివంగత నేత, బెల్లంపల్లి తొలి ఎమ్మెల్యే గుండా మల్లేశ్ ఆశయ సాధనకు సీపీఐలోని ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో సోమవారం గుండా మల్లేశ్ 5వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతి మాట్లాడుతూ లారీ క్లీనర్ నుంచి ఎమ్మెల్యే వరకు ఎదిగి ప్రజా, కార్మిక హక్కుల సాధన కోసం అలుపెరుగని ఉద్యమాలు చేశారన్నారు. మండల కార్యదర్శి నర్సయ్య, గోలేటి పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి జగ్గయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, కిరణ్‌బాబు, కాంట్రాక్టు కార్మిక సంఘం గోలేటి కార్యదర్శి అశోక్, నాయకులు మల్లేశ్, అంజయ్య, షకీల్, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వాహనాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలి

రెబ్బెన: వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. లైసెన్స్, ఆర్సీ, ఇన్సురెన్స్, ట్యాక్స్ వంటి పత్రాలను పరిశీలించి పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

ఉపాధ్యాయుడు రాక.. చదువు సాగక!

ఆసిఫాబాద్‌రూరల్: సమయానికి ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు బడి బయటే ఎదురు చూసిన ఘటన మండలంలోని బానర్‌గొందిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బానర్‌గొంది గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు సోమవారం 10 గంటలు దాటినా పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు రోడ్డుపైనే వేచి చూశారు. ఉపాధ్యాయుడు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ పేర్కొన్నారు. పాఠశాలకు ఆలస్యంగా రావడంపై ఏసీఎంవో ఉద్దవ్ ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా కొంతమంది విద్యార్థుల కోసం పక్క కాలనీలోకి వెళ్లినట్లు సమాధానమిచ్చారని ఏసీఎంవో తెలిపారు.



పాఠశాల ఎదుట వేచి చూస్తున్న విద్యార్థులు

నాణ్యమైన విద్యనందించాలి

నేరడిగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోధనలో సాంకేతికను జోడించి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచాలన్నారు. బోధనలో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీత, ఉపాధ్యాయులు వెంకట రమణ, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీప సేవాలంకరణ



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివ మల్లన్న దేవాలయంలో సోమవారం రాత్రి సహస్ర దీప సేవాలంకరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్ధ నక్షత్రాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా శివమల్లన్న స్వామికి హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

16 నుంచి దండారీ ఉత్సవాలు షురూ

నార్నూర్: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే దండారీ ఉత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభమవుతాయని గ్రామ పటేళ్లు మెస్రం రూప్‌దేవ్, మాడవి నారంజీ పటేల్, తొడసం భీంరావు ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలో బాబేఝరి చిత్తగూడ, ఖైర్దాత్వా, మాన్కాపూర్ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దండారీ ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. 16న దండారీ ఉత్సవాలు ప్రారంభం, 17న బాబేఝరి చిత్తగూడ గ్రామానికి చెందిన తొడసం వంశస్తుల దండారీ మాన్కాపూర్ మెస్రం వంశీయుల దండారీని కలవడానికి వస్తారని తెలిపారు. 18న మాన్కాపూర్ మెస్రం వంశీయుల దండారీ బృందం ఖైర్దాత్వా గ్రామ మాడవి వంశీయుల దండారీ బృందానికి కలుస్తారని, 19న బాబేఝరి చిత్తగూడ తొడసం వంశీయుల దండారీ బృందం ఖైర్దాత్వా గ్రామ మాడవి దండారీ బృందానికి సంప్రదాయబద్ధంగా కలుస్తారని పేర్కొన్నారు. 20న దీపావళి పూజ అనంతరం కొలబడి పూజతో దండారీ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్ బిట్టుబాయి అన్నారు. పోషణ మాసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని మోవాడ్ అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార పదార్థాలతో ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కమల, రమ్య, పార్వతి, సోముబాయి తదితరులు పాల్గొన్నారు.



మోవాడ్‌లో పోషణ మాసం వారోత్సవాల్లో సిబ్బంది

'దళితులపై దాడులు, దౌర్జన్యాలు ఆపాలి'

ఆసిఫాబాద్‌రూరల్: దేశంలో దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, దౌర్జన్యాలను ఆపాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కేశవరావు అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం నల్లజెండాలతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీఆర్ గవాయిపై దాడి చేసిన న్యాయవాది కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, సత్యనారాయణ, సుదర్శన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మూసివేసిన యూటర్న్ వినియోగంలోకి తేవాలి

రెబ్బెన: మండలంలోని దేవులగూడ వద్ద జాతీయ రహదారిపై మూసివేసిన యూటర్న్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని మాజీ జెడ్పీటీసీలు వేముర్ల సంతోష్, సోమయ్య, కాంగ్రెస్ నాయకుడు గుంపుల విమలేశ్‌లు కోరారు. దేవులగూడ గ్రామస్తులతో కలిసి సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వారు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నేషనల్ హైవే అధికారులు దేవులగూడ గ్రామస్తుల కోసం దేవులగూడ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారన్నారు. దేవులగూడతో పాటు గోలేటి గ్రామానికి వెళ్లే ప్రజలు, ఇతర గ్రామాల ప్రజలు యూటర్న్ వద్ద రోడ్డు దాటి వెళ్లేవారని తెలిపారు. కొన్ని రోజుల క్రితం అధికారులు యూటర్న్‌ను మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూటర్న్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు యూటర్న్ వద్ద ఒక్క ప్రమాదం జరగకపోయినా అధికారులు యూటర్న్‌ను ఎందుకు మూసివేశారో తెలియడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, నాయకులు బొమ్మినేని శ్రీధర్, సునీల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

వెలుగని విద్యుత్ దీపాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీలో గత నెల రోజులుగా హైమాస్ లైట్లు వెలుగకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత సిబ్బందిని కాలనీవాసులు ఫోన్ ద్వారా అడిగితే బల్బులు లేవని సమాధానం చెబుతున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని త్వరగా లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కసాబ్‌వాడీలో వెలుగని విద్యుత్ దీపాలు